

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక



బతుకమ్మ పండుగ అంటేనే అందరికీ ఒక కోలాహలమైన వాతావరణం నెలకొంటుంది. ప్రతీ సంవత్సరం జగిత్యాల లో ఐఎంఏ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఘనంగా బతుకమ్మ, దసరా ఉత్సవాలను నిర్వహించుకుంటున్నాం. ఆ రోజంతా కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఎంజాయ్ చేస్తూ మహిళ డాక్టర్లంతా బతుకమ్మ ఆటలు ఆడుతాం. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. – డాక్టర్ ఒడ్నాల రజిత, డీజీవో, రాయికల్

కోలాటాలతో సందడి



మహిళల జీవితాల్లో విడదీయని పండుగ బతుకమ్మ. ముఖ్యంగా ఎంతో బిజీగా ఉండే డాక్టర్లంతా కలిసి బతుకమ్మ సందర్భంగా వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మను తయారు చేస్తాం. అనంతరం ఉత్సాహంగా బతుకమ్మ, కోలాటాలు ఆడుతాం. బతుకమ్మ అంటేనే మహిళలతో ఒక విడదీయరాని బంధం. – డాక్టర్ రోజా, డీజీవో, జగిత్యాల

విదేశాల్లో వేడుకలు గర్వకారణం



బతుకమ్మ పండుగ అంటేనే మహిళల్లో ఒక పండుగ వాతావరణం నెలకొంటుంది. ప్రతిరోజు ఎంతో బిజీగా ఉన్నప్పటికీ బతుకమ్మ ఆటలు ఆడుతూ నేటి తరానికి ఆచార సాంప్రదాయాలను కాపాడుతూ వాటి విశిష్టత గురించి వివరిస్తున్నాం. మన బతుకమ్మ పండుగను ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకోవడం మనకు గర్వించదగ్గ విషయం. – డాక్టర్ మోర శ్రీలత, ఎండీ

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి పద్మశాలీ సంఘం భవన నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని సోమవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నిధులు మంజూరుకు కృషి చేస్తానని సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,గ్రామ సంఘ అధ్యక్షుడు పారిపెల్లి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంట్ల నిరసన



ఏవో ఎస్బీకి వినతిపత్రం ఇస్తున్న ఏజెంట్లు

ధర్మపురి: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్మపురి ఎల్ఐసీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవిత బీమా ఏజెంట్ల యూనియన్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీని ఎత్తివేయాలని అదే విధంగా పాలసీలపై బోనస్ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో ఎస్బీ నర్సయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ నాయకులు గుండయ్య, భూమన్న, రామకిష్టయ్య, భాస్కర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్పర్సన్ మల్లేశ్వరి

మల్యాల: మల్యాల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ యార్డు కమిటీ చైర్పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ కేతిరెడ్డి జీవన్రెడ్డి, సభ్యులు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యదర్శి వరలక్ష్మి, సూపర్వైజర్ శ్రీదేవి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.నాయకులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మల్లాపూర్లో పూజలు చేస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మల్లాపూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పనులపై మండలస్థాయి 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జగదీశ్ తెలిపారు. ఉపాధిహామీ పనులపై డీపీఆర్వో, పీఆర్వోలు గ్రామస్థాయిలో ఈ నెల 1 నుంచి 6 వరకు తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. గ్రామసభలో చర్చించిన అంశాలపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు.



కోరుట్లలో భవానీ దీక్షాపరుల పూజలు



మెట్పల్లిలో మహిళల కుంకుమపూజలు



ఇబ్రహీంపట్నంలో అన్నప్రసాద వితరణ



మేడిపల్లిలో మహిళల పూజలు



పెగడపల్లిలో..



వెల్గటూర్లో బోనాలతో వస్తున్న మహిళలు

దుర్గమాతకు బోనాలు, ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/ధర్మపురి/మెట్పల్లి/మల్లాపూర్/మేడిపల్లి/ఇబ్రహీంపట్నం/వెల్గటూర్/పెగడపల్లి: దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం పలు చోట్ల దుర్గామాత స్కందమాత, శ్రీ మహాచండీదేవి అవతార, లలితత్రిపుర సుందరి, శాఖాంబరి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. మండపాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు నిర్వహించారు.



మల్లాపూర్లో బోనాలతో వస్తున్న మహిళలు



లక్ష్మీపూర్లో శాఖాంబరి అవతారంలో దుర్గాదేవి



బతుకమ్మ ఆడుతున్న జెడ్పీ మాజీ చైర్పర్సన్



ముంబాయిలో బతుకమ్మలతో మహిళలు

బతుకమ్మ సంబరాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్పర్సన్ దావ వసంతతో పాటు, నాయకులు పాల్గొని బతుకమ్మ ఆటలాడారు.

ముంబాయిలో బతుకమ్మ వేడుకలు

జగిత్యాలరూరల్: మహారాష్ట్రలోని ముంబాయి నగరంలో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం థానేలోని బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం మహిళలు పెద్ద ఎత్తున రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి, ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు.

నేడు మహా బతుకమ్మ సంబరాలు

జగిత్యాల: పద్మశాలీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మహాబతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. పట్టణంలోని అంగడిబజార్లో కార్యక్రమం ఉంటుందని, మహిళలు బతుకమ్మలతో రావాలని, ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు, అమ్మవారి ప్రసాదం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు శోభారాణి, స్వప్న, వీరబత్తిని కవోష్ణ, సునీత, శైలజ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అడ్లూరి

వెల్గటూర్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో జై హనుమాన్ ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్



అయిలాపూర్లో 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 18 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువు నేర్పిన గురువులు అంజిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, భూమాచారి, నాగేశ్వర్, చాంద్ఖాన్లను సన్మానించారు.ఆటాపాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యారుల సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులంతా వారి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేసి, ఉల్లాసంగా గడిపారు.



పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చిన్న పరిశ్రమలతో యువతకు ఉపాధి

• ఎమ్మెల్సీ జీవన్రెడ్డి

జగిత్యాలరూరల్: చిన్న పరిశ్రమలతో గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్సీ జీవన్రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలరూరల్ మండలం పోరండ్లలో మినీ ఆయిల్మిల్ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొగళ్ల సంధ్యారాణి, మాజీ ఎంపీటీసీ లక్కాడి స్వామిరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్, మారుతి, రాజేందర్, సతీశ్, కోటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎంపీవో

జగిత్యాల అర్బన్ ఎంపీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వాసవి సోమవారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఆయిల్ మిల్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

పాములకు ఆవాసంగా కమ్మరిపేట

మేడిపల్లి: భీమారం మండలంలోని కమ్మరిపేట విష సర్పాలకు ఆవాసంగా మారింది. నిత్యం ఎవరో ఒకరి ఇంట్లో పాములు దూరుతున్నాయి. వారం రోజుల్లో పది మంది ఇళ్లల్లో విష సర్పాలను దొరకబట్టి మట్టుబెట్టారు. ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తున్నాయో అర్థం కాక జనాలు బెంబేలెత్తిపోతున్నారు. బతుకమ్మ దసరా పండగపూట ఈ విష సర్పాల బాధ గ్రామస్తులను ఇబ్బంది పెడుతోంది. గ్రామంలో చిన్నారులను ఒంటరిగా బయటికి పంపడానికి బయపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గ్రామాల్లో పచ్చికబయల్లు అధికంగా ఏర్పడటం, మొక్కజొన్న పంటలు కోయడంతో జనావాసాల్లోకి పాములు వస్తున్నాయి. గ్రామస్తులు జగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు.



కమ్మరిపేటలో ఓ ఇంట్లో దూరిన పాము

ఇరువర్గాలపై కేసు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో పరస్పరం దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్కుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వేంపల్లికి చెందిన భూక్య రాము, అతని తమ్ముడు భూక్య లక్ష్మణ్ పాతకక్షలతో ఆదివారం ఆదే గ్రామానికి చెందిన మెండె నివోద్ ఇంటిపైకి వెళ్లి అక్కడ ఉన్న నివోద్ నాన్నమ్మ గంగు, తాతయ్య బిరుదుల సాయన్న, అత్తమ్మ కాండ్లపల్లి లక్ష్మితో పాటు నిగ రాజుపై దాడి చేసి కొట్టారు. ఈ క్రమంలో దాడిని అడ్డుకోబోయిన మెండె నివోద్ను కర్రతో కొట్టగా, తలకు తీవ్ర గాయమైంది. దీంతో మెండె వినోద్, అతని అన్న మెండె నిఖిల్ ప్రతిఘటించి భూక్య రాము, లక్ష్మణ్లపై కర్రలతో దాడి చేయడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. దాడి ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై కిరణ్కుమార్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

మెట్పల్లి: తప్పిపోయిన బాలున్ని అధికారులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా రేంజర్లకు చెందిన రాకేశ్ దంపతులు తమ కుమారుడు అన్విత్(4)తో కలిసి షాపింగ్ కోసం మెట్పల్లికి వచ్చారు. బస్స్టేషన్కు సమీపంలో ఉన్న ఓ మాల్లో షాపింగ్ చేస్తుండగా, అన్విత్ అందులో నుంచి నడుచుకుంటూ బస్స్టేషన్కు వచ్చాడు. తిరిగి అక్కడకు వెళ్లలేక ఏడ్చుకుంటూ కూర్చున్నాడు. గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే పలు చోట్ల వెతికిన అతని తల్లిదండ్రులు చివరకు అక్కడకు చేరుకోవడంతో బాలుడిని వారికి అప్పగించారు.

బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులు ప్రారంభం

మేడిపల్లి: భీమారం మండలంలోని రాజలింగంపేట్, రత్నాలపల్లి గ్రామల మధ్య చెరువులోనే బతుకమ్మ ఘాటు ఉండేదని. కానీ గత రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోయి బతుకమ్మ ఘాట్ కొట్టుకుపోయింది. దీంతో బతుకమ్మ ఆడుకోవడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకుపోగా, ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. సోమవారం నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి మల్లేశం, గ్రామ కార్యదర్శి మహేంద్ర , గుగ్గిల గంగారం, వడ్ల నారాయణ, లక్ష్మణ్,మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

సారంగాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.డీ జమీర్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆన్లైన్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు, ఓటర్లుగా నమోదు చేసుకున్న వివరాలతో పాటు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తు అందజేయాలని సూచించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రాయికల్: మండలంలోని భూపతిపూర్లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను సోమవారం ఎంపీవో సుష్మ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరికృష్ణ, గ్రామ నాయకులు జక్కుల చంద్రశేఖర్, మహేందర్గౌడ్, లక్ష్మీనారాయణ, గంగాధర్, మల్లేశం, ప్రతాప్, సత్య పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి



ధర్మపురి : ధర్మపురిలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

బీర్పూర్ నృసింహునికి పల్లకీసేవ



పల్లకీసేవలో భక్తులు, అర్చకులు

సారంగాపూర్: బీర్పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను పల్లకీలో ఆసీనులను చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మంగళవారం స్వామివారికి శేషవాహణసేవ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో అన్న పూజ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని సహస్ర లింగాల దేవాలయంలో సోమవారం అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

శేష వాహనంపై స్వామివారు



కోరుట్ల: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాల్లో బాగంగా స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

బేస్బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోరుట్ల: అక్టోబర్ 11 నుంచి 13వ తేది వరకు హర్యానాలో నిర్వహించనున్న 9వ జూనియర్ బేస్బాల్ పోటీలకు కోరుట్ల పబ్లిక్ స్కూల్కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వెంకటేశం తెలిపారు. వీరిలో రిత్విక్, గితేశ్, శరణ్య, ధనుష్క, మనోజ్ఞ, శశివర్ధన్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

యోగాలో విద్యార్థి ప్రతిభ

ఇటీవల హైదరాబాద్లో జరిగిన ఐదు రాష్ట్రాల యోగా విన్యాసాల పోటీల్లో కోరుట్లకు చెందిన సామల సత్యం–వసుంధర కుమారుడు నవనీత్ ప్రతిభ చూపి ప్రశంసాపత్రం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నవనీత్ కల్లూర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

గుడుంబా విక్రయదారుల బైండోవర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, ఎర్రాపూర్ తండాలో గుడుంబా విక్రయదారులను పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని వేములకుర్తిలో పల్లె శ్రీనివాస్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకుకొని 3 లీటర్ల గుడుంబాను, ఎర్రాపూర్ తండాలో బుక్య లక్ష్మీబాయి గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకొని 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని సామవారం తహసీల్దార్ ప్రసాద్ ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం

మేడిపల్లి: ఎమ్మెల్యే, ఎంపీ ఎంపీ ఎన్నికల సమయంలో పట్టుబడిన 350 లీటర్ల మద్యాన్ని సోమవారం ఎక్సైజ్ టాస్క్ పోర్స్ సీఐ రాజమౌళి, మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1,70,000 వేలుగా ఉంటుందని పేర్కొన్నారు.